క్లుప్తంగా

ఆటో మ్యుటేషన్‌పై నేడు అవగాహన సదస్సు

ఒంగోలు సబర్బన్‌: నగర పరిధిలో రికార్డుల ఆటో మ్యుటేషన్‌ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించే నిమిత్తం ఒంగోలు ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఎన్టీఆర్‌ కళాక్షేత్రంలో శనివారం ఉదయం 10:30 గంటలకు సదస్సు నిర్వహించనున్నట్లు ఒంగోలు నగర కమిషనర్‌ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్టాంపులు, రిజిస్ట్రేషన శాఖ సబ్‌ రిజిస్ట్రార్‌లు పాల్గొంటారన్నారు. ఆటో మ్యుటేషన్‌ విధానం, ప్రయోజనాలు, అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై అవగాహన కలిపించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: మద్దిపాడు సబ్‌స్టేషన్‌ పరిధిలో 11కేవీ వెల్లంపల్లి ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్నంగి, మల్లవరం, రాచవారిపాలెం, నాగన్నపాలెం, గాజులపాలెం, కీర్తిపాడు గ్రామాల వినియోగదారులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీ–4 కుటుంబాల డేటా పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్‌): సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామంలోని ఎస్సీ, ఎస్టీకాలనీలలో సచివాలయ సిబ్బంది శుక్రవారం పీ–4 బంగారు కుటుంబాల డేటా సేకరించారు. సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌ బాబు పాల్గొని పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. పకడ్బందీగా పీ–4 బంగారు కుటుంబాల సర్వే నిర్వహించాలని ఆదేశించారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ అందజేత




ల్యాప్‌టాప్‌ అందిస్తున్న లయన్స్‌ క్లబ్‌ నిర్వాహకులు

చీమకుర్తి: ఎంసీఏ చదువుతున్న పేద విద్యార్థినికి లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తిలో ల్యాప్‌టాప్‌ అందించారు. లయన్స్‌ క్లబ్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ బీ జవహర్‌ పుట్టినరోజును పురస్కరించుకుని లయన్స్‌ క్లబ్‌ నూతన అధ్యక్షునిగా ఎంపికైన చలువాది పార్థసారధి ఆర్థిక సహకారంతో గ్రానైట్‌ క్వారీలో పనిచేస్తున్న మురుగన్‌ కుమార్తెకు కాలేజీ అవసరాల నిమిత్తం ల్యాప్‌టాప్‌ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చలువాది రమేష్‌, నూనె హేమ సుందర్‌, స్థానికులు పాల్గొన్నారు.

మ్యుటేషన్‌ అర్జీల భూముల పరిశీలన

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్‌):మ్యుటేషన్‌ నిమిత్తం వచ్చిన అర్జీలకు సంబంధించిన భూములను సంతనూతలపాడు తహసీల్దార్‌ ఎస్‌ఎల్‌ నారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని ఆశ్రమం సమీపంలో సర్వే నంబర్లు 191, 204, 274లోని అర్జీదారులకు సంబంధించిన భూములను పరిశీలించారు. తహసీల్దార్‌ వెంట వీఆర్వో కసుకుర్తి జాలయ్య, అర్జీదారులు పాల్గొన్నారు.

విద్యాశక్తితో మానసిక సమస్యలు



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

మార్కాపురం: ఉన్నత పాఠశాలల్లో విద్యాశక్తి విధానాన్ని రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన రాయవరం, గజ్జలకొండ, తూర్పుపల్లి, గోగులదిన్నె తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు. ఎర్రయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటలాడుకోవాల్సిన సమయంలో బలవంతంగా పాఠశాలల్లో కూర్చోబెట్టి చదివించడం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, విద్యాశక్తి విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, ప్రభాకర్‌రావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు ఆపాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్‌ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్‌ వెంకటేశ్వర్లు

ఒంగోలు సిటీ: జిల్లాలోని పీహెచ్‌సీలలో మాతృ మరణాలు జరగకుండా చూడాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్‌ వెంకటేశ్వర్లు వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక డీఎం అండ్‌ హెచ్‌ఓ చాంబర్‌లో ఆయన అధ్యక్షతన మాతృ మరణాల సబ్‌ కమిటీ ద్వారా మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్‌ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సకాలంలో ప్రమాద సంకేతాలు గల గర్భిణులను నమోదు చేసి వారికి వెంటనే సేవలు అందించాలని ఆదేశించారు. అన్ని వివరాలను ఆర్‌సీహెచ్‌ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రమాద సంకేతాలు గల గర్భిణులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వారి బర్త్‌ ప్లాన్‌ తయారు చేయాలన్నారు. ప్రొటోకాల్‌ ప్రకారం వారికి అందించే సేవలను వైద్యాధికారి పరివేక్షణలో అందించాలన్నారు. ఆశా వర్కర్‌, ఏఎన్‌ఎంలు వారి సమీపంలోని ఏరియా ఆస్పత్రికిగానీ, సర్వజన ఆస్పత్రికిగానీ, ఎంసీహెచ్‌కిగానీ సకాలంలో 108 వాహనం ద్వారా గర్భిణులను తరలించాలని కోరారు. ఆస్పత్రిలో సంబంధిత గర్భకోశ నిపుణుల ద్వారా గర్భిణీ స్త్రీకి అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని చెప్పారు. గర్భిణీ స్త్రీలను ప్రతి నెలా 10వ తేదీ ప్రధానమంత్రి మాతృ వందన యువజన కార్యక్రమానికి తీసుకొచ్చి అక్కడ అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, స్కానింగ్‌లు చేయించాలని, ఆ వివరాలను గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు తెలియజేయాలని చెప్పారు. ఎంసీపీ కార్డులో కూడా నమోదు చేయాలన్నారు. సిబ్బంది ఎవరైనా గర్భిణులను ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డాక్టర్‌ సంధ్యారాణి, డీసీహెచ్‌ డాక్టర్‌ శ్రీనివాసనాయక్‌, డాక్టర్‌ సూరిబాబు, డాక్టర్‌ అనంతకుమార్‌, డాక్టర్‌ ప్రభాకర్‌, డాక్టర్‌ బి.వెన్నెల, డాక్టర్‌ మణిబాబు, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్‌ కమల, ఫాగ్సీ ప్రతినిధి డాక్టర్‌ హరి, శ్రీలత, గొట్టిపాటి నర్సింగ్‌ హోమ్‌, అద్దంకి డాక్టర్‌ వాణిశ్రీ, డాక్టర్‌ కమలశ్రీ, మాస్‌ మీడియా అధికారి శ్రీనివాసులు, శ్రీదేవి హెల్త్‌ ఎడ్యుకేటర్‌, 108 సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సమావేశం

- విజయవంతం చేయాలని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపు



లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: కొత్తపట్నం గ్రామంలోని నల్లూరి గార్డెన్‌ పక్కన ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సమావేశం జరుగుతుందని, వైఎస్సార్‌ సీపీ శ్రేణులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ సమావేశానికి పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, వైఎస్సార్‌ సీపీ ఒంగోలు పార్లమెంట్‌ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్‌, పీడీసీసీ బ్యాంక్‌ మాజీ చైర్మన్‌ మాదాసి వెంకయ్య, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, మార్కెట్‌ యార్డ్‌ మాజీ చైర్మన్లు యేలం వెంకటేశ్వరరావు, ఇనగంటి పిచ్చిరెడ్డి, రైతు విభాగం జోనల్‌ చైర్మన్‌ ఆళ్ల రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్‌, బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, ప్రకాశం జిల్లా లీగల్‌ సెల్‌ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అంజిరెడ్డి కోరారు.

లోపాయికారిగా రవాణా శాఖ అధికారులు

- ఓవర్‌లోడ్‌లు తోలేందుకు కొంతమందికి సహకరిస్తున్నారు
- చీమకుర్తి కంకర క్రషర్‌ మిల్లర్లతో కుమ్మక్కయ్యారు
- పేర్నమిట్ట వద్ద ఒంగోలు టిప్పర్‌ అసోసియేషన్‌ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఒంగోలు టిప్పర్‌ అసోసియేషన్‌ నాయకులు

ఒంగోలు సబర్బన్‌: రవాణా శాఖ అధికారులు లోపాయికారిగా వ్యవహరిస్తున్నారని ఒంగోలు టిప్పర్‌ అసోసియేషన్‌ నాయకులు ధ్వజమెత్తారు. ఆ మేరకు పేర్నమిట్ట వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ అధ్యక్షుడు పసుపులేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ఒంగోలు–సంతనూతలపాడు రోడ్డుపై వచ్చే ఓవర్‌ లోడు టిప్పర్లను ఆపి వారికి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఓవర్‌ లోడ్‌ వలన రహదారుల్లో జరిగే ప్రమాదాలపై టిప్పర్ల డ్రైవర్లకు వివరిస్తున్నామని చెప్పారు. ఒంగోలు రవాణా శాఖ అధికారులు టిప్పర్లు ఓవర్‌ లోడులు వద్దని, పాసింగ్‌ లోడులు మాత్రమే తోలాలని చెప్పారని, అందుకోసం ఒంగోలు అసోసియేషన్‌ ఆధ్వర్యంలో పాసింగ్‌ లోడ్‌లు తోలేందుకు సిద్ధమయ్యామని అన్నారు. అయితే, చీమకుర్తి క్రషర్‌ యజమానులు, మిల్లర్ల యజమానులు వారి టిప్పర్లలో మాత్రం ఓవర్‌ లోడులు తోలుతున్నారన్నారు. అదేమని రవాణా శాఖ అధికారులను అడిగితే సమాధానం లేదన్నారు. క్రషర్ల యజమానులతో రవాణా శాఖ అధికారులు లోపాయికారిగా వ్యవహరించి వారికి సహకరిస్తున్నారని మండిపడ్డారు. రవాణా శాఖ, పోలీసు శాఖ ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా పరిమితికి మించి రవాణా చేయకూడదని ఆదేశించారని, ఆ ఆదేశాలు పాటించేందుకు ఒంగోలు టిప్పర్‌ ఓనర్స్‌ అసోసియేషన్‌ తరఫున సమ్మతించామని అన్నారు. కానీ, కొంత మంది వాహన యజమానులు పాటించకుండా దారి మళ్లించి ఓవర్‌ లోడుతో రవాణా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జరుగుమల్లి, కామేపల్లి, పొదిలి, దర్శి, గుంటి గంగవరం, నాగులుప్పలపాడు, మద్దిపాడు, తాళ్లూరు, టంగుటూరు, సింగరాయకొండ మీదుగా రవాణా చేస్తున్నారన్నారు. తాము గవర్నమెంటు నిర్ణయించిన పరిమితి లోడుతో రవాణా చేయడం వలన వినియోగదారుల నుంచి తమకు ఎటువంటి ఆఫర్లు రావడం లేదని, వారు అలా చేయడం వలన తమ జీవనం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్‌ కార్యదర్శి ఆకుల మోహనరావు మాట్లాడుతూ ఓవర్‌ లోడు వాహనాలపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు వి.ఆంజనేయులు, కోశాధికారి పార్శం దనుంజయ్‌, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దోమలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న ఫార్మసీ అధికారి రత్నకుమార్‌

ఒంగోలు సబర్బన్‌: దోమల వలన వచ్చే అనర్థాల గురించి ప్రజలు తెలుసుకోవాలని ఏపీ ఫార్మసీ యూనియన్‌ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ప్రాసంగులపాడు ఫార్మసీ అధికారి ఎంపీ రత్నకుమార్‌ సూచించారు. నగరంలోని త్రోవగుంటలో జీపీఐ, మహమ్మద్‌ పొగాకు కంపెనీల్లో గ్రేడింగ్‌ చేస్తున్న మహిళలకు దోమలతో కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. దోమలపై సమరభేరిపై ఆరో అవగాహన కార్యక్రమం నిర్వహిసున్నట్లు తెలిపారు. దోమల కారణంగా వచ్చే జ్వరాలు, వ్యాధుల గురించి వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటంతో పాటు తొట్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్‌

నాగులుప్పలపాడు: మండలంలోని చేకూరపాడు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్‌ హైస్కూల్‌, మద్దిరాలపాడు పీవీసీ ఎయిడెడ్‌ హైస్కూల్‌ను శుక్రవారం డీఈఓ కిరణ్‌ కుమార్‌ సందర్శించారు. పదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఆయా పాఠశాలల విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు. పాఠశాలల రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆధునికీకరించిన రెవెన్యూ భవన్‌ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఒంగోలు సబర్బన్‌: నగరంలో ఆధునికీకరించిన ఏపీ రెవెన్యూ సర్వీసెస్‌ అసోసియేషన్‌ జిల్లా భవనాన్ని ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రారంభించారు. ఒంగోలు ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణానికి ఆనుకుని ఉన్న రెవెన్యూ అసోసియేషన్‌ భవనాన్ని ప్రారంభించిన బొప్పరాజు.. ముందుగా దివంగత కామ్రేడ్‌ తోట సుధాకర్‌ ప్రసాద్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం రెవెన్యూ భవన్‌ ఆధునికీకరణ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రెవెన్యూ భవన్లో ఆధునికీకరించిన ఐదు రూముల్ని బొప్పరాజు వెంకటేశ్వరు, వలిశెట్టి దామోదర్‌, చేబ్రోలు కృష్ణమూర్తి, ఏపీ జేఏసీ అమరావతి కో చైర్మన్‌ జనకుల శ్రీనివాసరావు ప్రారంభించారు. అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదన్‌రావు, సెక్రటరీ రామచంద్రుని వాసుదేవరావు, ట్రెజరర్‌ ఊతకోలు శ్రీనివాసరావు, ఏపీ జేఏసీ అమరావతి ఉమెన్‌ వింగ్‌ చైర్‌పర్సన్‌ జయలక్ష్మి, కలెక్టరేట్‌ ప్రెసిడెంట్‌ సాయి శ్రీనివాసరావు, ఒంగోలు డివిజన్‌ ప్రెసిడెంట్‌ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏవీ రవిశంకర్‌, ఎస్‌.వెంకట భార్గవ రాజేష్‌, ఆర్గనైజేషన్‌ సెక్రటరీ పీఆర్‌ఎస్‌ శర్మ, స్పోర్ట్స్‌ అండ్‌ కల్చరల్‌ సెక్రటరీ ఎస్‌.రామనారాయణరెడ్డి, ఈసీ మెంబర్స్‌ డి.వెంకటేశ్వర్‌ రెడ్డి, వై.ప్రశాంత్‌ నాయుడు, కలెక్టరేట్‌ సెక్రటరీ బీ రాజశేఖర్‌రెడ్డి, కలెక్టరేట్‌ పరిపాలన అధికారి టి.రవి, ఏపీ అమరావతి ఉమెన్‌ వింగ్‌, రెవెన్యూ అసోసియేషన్‌ జిల్లా కార్యవర్గ సభ్యులు, కలెక్టరేట్‌ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యుడు నాగేశ్వరరావు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్‌): ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని, ప్రశ్నించేతత్వం అలవరచుకోవాలని ప్రముఖ వైద్యుడు కొల్లా నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం పేర్నమిట్ట హైస్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 8, 9, 10, తరగతులు చదివే విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్ణయించే గోల్‌ ఎంచుకోవాలని పిలుపునిచ్చారు. కూల్‌ డ్రింక్స్‌ తాగడం వల్ల కలిగే అనర్థాలు, బయట విక్రయించే తినుబండారాలతో కలిగే అనారోగ్యం, తదితర వాటిపై జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి చిన్నాజీ, ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ కె.టి.సి.పాపారాయుడు వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్‌ హెచ్‌ఎం పార్వతి శాంతి, విద్యా కమిటీ కన్వీనర్‌ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.

దేవస్థానాలలో శ్రావణమాసం సందడి



కేశవస్వామిపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి కుంకుమ పూజలో పాల్గొన్న మహిళా భక్తులు



సంతపేట షిర్డీ సాయిబాబా మందిరంలో సామూహిక లలితా సహస్రనామ పారాయణంలో పాల్గొన్న మహిళా భక్తులు

- వ్రత పూజలకు ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



చీమకుర్తిలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో: శ్రావణమాసం శుక్రవారం ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా దేవస్థానాలలో సందడి మొదలైంది. శ్రావణమాస కుంకుమ పూజలకు, సామూహిక వరలక్ష్మి, సత్యనారాయణస్వామి వ్రతాలకు దేవస్థాన నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఒంగోలు బాలాజీరావుపేటలోని శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో, లాయరుపేట షిర్డీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరీదేవికి, కేశవస్వామిపేటలోని శ్రీ విజయదుర్గమ్మవారికి, గొడుగుపాలెంలోని పార్వతమ్మ దేవస్థానంలో, కొత్తపట్నం బస్టాండ్‌ నల్లూరి నర్సింగ్‌ హోం దగ్గర ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో, కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిర్డీ సాయిబాబా మందిరంలో నాగలక్ష్మి అమ్మవారికి, సమతా నగర్లోని శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో, కేశవస్వామిపేటలోని అతి పురాతన కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో గంగా అన్నపూర్ణ అమ్మవారికి శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా, తీర్థ ప్రసాదాలు అందించారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: శ్రావణ శుక్రవారం సందర్భంగా చీమకుర్తిలోని సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహిళా భక్తులు శ్రీకనకదుర్గమ్మకు పూజలు చేశారు. అభిషేకాలు, సహస్ర నామార్చనలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీర్వచనాలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రుడు శివ



వైద్యశాలలో చికిత్స పొందుతున్న రవి

పొదిలి: పొదిలి–మార్కాపురం రోడ్డులో మాదాలవారిపాలెం సమీపంలో శుక్రవారం రాత్రి సంభవించిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్కూటీ–మోటారు సైకిల్‌ ఎదురెదురుగా ఢీకొనడంతో కొనకనమిట్ల మండలం మునగపాడు గ్రామానికి చెందిన శివరాత్రి శివ, కొనకనమిట్ల మండల కేంద్రానికి చెందిన పోతిపోగు రవి, ముండ్లమూరి అఖిల్‌రాజ్‌ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శివను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించినట్లు బంధువులు తెలిపారు.

30న సంతనూతలపాడు మండల పరిషత్‌ సమావేశం

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్‌): సంతనూతలపాడు మండల పరిషత్‌ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. ఈ సమావేశానికి సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ అధ్యక్షత వహిస్తారని, పలు రంగాల అభ్యున్నతిపై చర్చ జరుగుతుందని చెప్పారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పైర్లను పరిశీలిస్తున్న సుభాషిణి, వ్యవసాయ శాఖ అధికారులు

కొత్తపట్నం: రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్‌ కమ్యూనిటీ నేచర్‌ ఫార్మింగ్‌ జిల్లా ప్రాజెక్ట్‌ మేనేజర్‌ వి.సుభాషిణి ఆధ్వర్యంలో ఒంగోలు సబ్‌ డివిజన్‌ వ్యవసాయ సహాయ సంచాలకుడు రమేష్‌బాబు పర్యవేక్షణలో వ్యవసాయ, ఉద్యానవన గ్రామ సహాయకులకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండో రోజైన శుక్రవారం మండలంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. వివిధ రకాల పంటలు వేసిన రైతుల పొలాలను సందర్శించారు. పాదర్తి గ్రామంలో మస్తానయ్య వేరుశనగ ఏ గ్రేడ్‌ మోడల్‌, మేడ కోటయ్య వేరుశనగ కంప్లోక్ట్‌ బ్లాక్‌, కాటా సురేంద్ర నవధాన్యాల సాగు ఏటీయం మోడల్‌ను పరిశీలించారు. నాంచార్లరెడ్డి ఆకుకూరలు, కూరగాయల సాగులో వచ్చే పురుగులు, తెగుళ్ల నివారణ కోసం వాడే కషాయాలు, గ్రోత్‌ ప్రమోటర్స్‌ లింగాకర్షక బుట్టలు, ప్రకృతి సాగులో ఖర్చు, ఆదాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మల్లేశ్వరి ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏవో కిషోర్‌బాబు, ఏఈవో అజయ్‌ కుమార్‌, ఏవీవో శ్రీనివాసులు, వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఎస్‌ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.